సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం, 19, అక్టోబర్, 2025



టపాసుల మోతే
దీపావళికి జిల్లాలో విక్రయ కేంద్రాలను సిద్ధం చేశారు. టపాసుల విక్రయ కేంద్రాల నిర్వహణకు అగ్నిమాపక శాఖ అధికారి ఏర్పాట్లు పర్యవేక్షణ చేస్తున్నారు. -IIలో



రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి
రాజంపేట-రాయచోటి రోడ్డులోని పాలకేంద్రం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మహేంద్రరెడ్డి మృతి చెందాడు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.220	రూ.270
రెండోరకం	రూ.150	రూ.210

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 142 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నవోదయలో ప్రవేశానికి గడువు పెంపు
రాజంపేట: జవహర్ నవోదయ విద్యాలయం (రాజంపేట మండలం నారమరాజుపల్లె)లో 2026-27 సంవత్సరానికి 11 వతరగతిలో ప్రవేశానికి మరోసారి గడువును పెంపుదల చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ప్రిన్సిపాల్ గంగాధరన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి అన్నమయ్య, కడప జిల్లాకు చెందిన విద్యార్థులు అర్హులన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌వీవీవోడీఏవైఏ.జీవోఎన్ వె వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. చివరి తేది 23-10-2025 అని వెల్లడించారు.

- 2026-27 సంవత్సరానికి సంబంధించి 9వ తరగతిలో ప్రవేశానికి కూడా గడువును పెంచినట్లు ప్రిన్సిపాల్ గంగాధరన్ తెలిపారు. 23.10.2025 వరకు గడువు ఉందని వెల్లడించారు.

శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం



నూతన పట్టు వస్త్రాలను తీసుకొస్తున్న టీటీడీ అధికారులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో శనివారం సీతారామలక్ష్మణ మూర్తులకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా మూల విరాట్‌కు పంచామృతాభిషేకం జరిపారు. టీటీడీ అధికారులు తీసుకొచ్చిన నూతన పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, తులసి గజమాలలతో సీతారామలక్ష్మణ మూర్తులను అందంగా అలంకరించారు. అనంతరం శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనాన్ని నిర్వహించారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న పీడీ వెంకటరత్నం తదితరులు


గాలివీడు: మొక్కలు నాటడం ద్వారా స్వచ్ఛమైన గాలి, పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని పర్యావరణ మండల ప్రత్యేక అధికారి.. ఉపాధిహామీ పీడీ వెంకటరత్నం అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా 'స్వచ్ఛమైన గాలి- ఆరోగ్యకరమైన జీవనం'అనే అంశంపై జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్, ఎస్ డబ్ల్యూపీసీ సెంటర్లో మొక్కలు నాటే కార్యక్రమం,సైకిల్ ర్యాలీ నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి పరిరక్షించాలని తెలిపారు.కార్యక్రమంలో మండల పరిషత్ అభివద్ధి అధికారి శికె.చంద్ర మౌళీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె జిల్లా లేనట్టేనా!

> జిల్లాల విభజన చేయాలన్నప్పుడు కొన్ని ఇబ్బందులు కూడా ఉన్నాయి. అవన్నీ ఏవిధంగా చేయాలన్నదానిపై కసరత్తు చేస్తాం.
> -రాజంపేట సభలో సీఎం చంద్రబాబు

సభలో రాజంపేట జిల్లా గురించి సభలో ప్రజలు సీఎంను ప్రశ్నించగా పై వ్యా ఖ్యలు చేశారు. ఈ మాటల్లో అర్థం, పరమార్థం అర్థమైపోయింది. ఇప్పట్లో కొత్తజిల్లాలు లేవన్న విషయం స్పష్టమైంది. చంద్రబాబు మాటల్లో ఇబ్బందులు, చిక్కులు ఉన్నాయని అన్నారంటే ఇక ఆ పని ముగిసినట్టే అన్నది అర్థం చేసుకోవాలి.

- భౌగోళిక స్వరూపాల మార్పు, చేర్పులపై కదలికలేని మంత్రివర్గ ఉపసంఘం
- అన్నమయ్యలో పుంగనూరు విలీనం పెండింగ్



మదనపల్లె పట్టణం వ్యూ

మదనపల్లె: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలను విభజించి కొత్త జిల్లాల ఏర్పాటు ప్రజల నుంచి అభ్యంతరాలు, వివాదాలు లేకుండా జరిగిపోయింది. అయితే కొత్త జిల్లాలను ఏర్పాటు చేస్తామంటూ గత అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబు, లోకేష్‌లు అధికారం కోసం విభజన రాజకీయాలను తెరపైకి తీసుకొచ్చారు. అందులో మదనపల్లె కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తామని ఇక్కడ జరిగిన సభలు, పర్యటనల్లో హామీలు ఇచ్చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటిపోయింది. అయితే ఎక్కడా కొత్త జిల్లాల ఏర్పాటు ప్రక్రియకు సంబంధించిన ఊసేలేదు. కనీసం దాని కదలికలు ఎక్కడా కనిపించడం లేదు. కేవలం ఎన్నికల్లో హామీగా దీన్ని వాడుకున్నట్టు స్పష్టంగా అర్థమవుతోంది.

జనాభా లెక్కల చిక్కు

కొత్తజిల్లాలు, మండలాలు, స్థానిక సంస్థల అప్‌గ్రేడ్, విభజనలు జరగాలంటే ఇంకో ఏడాదికి పైగా ఎదురుచూడక తప్పదు. ఎందుకంటే 2016 జనవరి నుంచి దేశవ్యాప్తంగా జనాభా లెక్కల సేకరణ ప్రారంభమై ఏడాది పాటు కొనసాగుతుంది. దీంతో ఇప్పుడున్న భౌగోళిక పరిస్థితుల్లో చేర్పులు, మార్పులు చేయడం సాధ్యంకాదు. ఇప్పుడు ఏ స్థితిలో ఎలా ఉన్నాయో అలానే ఉంచాలి. జనాభా లెక్కల ప్రక్రియ పూర్తయ్యాక ప్రభుత్వాలు తమ పరిస్థితుల ఆధారంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీన్నికాదని ప్రభుత్వం ఏ చర్య చేపట్టడానికి వీలులేదు. పైగా కేంద్రం నుంచి అనుమతులు ఉండవు. అంటే ప్రభుత్వం భౌగోళికంగా ఏ మార్పు చేపట్టినా జనాభా లెక్కల ప్రక్రియ పూర్తయ్యాకే చేయాలి.

స్థానిక ఎన్నికలపైనా ప్రభావం

వచ్చే ఏడాదిలో మున్సిపల్, గ్రామపంచాయతీ, మండల పరిషత్ పాలకవర్గాలకు పదవీకాలం పూర్తవుతుంది. ఇదే సమయంలో జనాభా లెక్కల సేకరణ కార్యక్రమం కొనసాగుతుంటుంది. దీని ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపైనా చూపుతుంది. వీటికి ప్రత్యేకాధికారుల పాలన కిందకు తీసుకురావాల్సిన పరిస్థితి కలుగుతుంది.

జిల్లా అంటూ ప్రచారం

మదనపల్లె జిల్లా అయిపోయిందంటూ ప్రచారం విస్తృతమైంది. ప్రధానంగా రియల్‌వర్గాల్లో ప్రచారం జోరుగా సాగుతోంది. మదనపల్లె పట్టణం, పరిసరాల్లో ఇళ్లస్థలాలకు, భూములకు ఉన్న డిమాండ్‌ను అధికం చేస్తున్నారు. కృత్రిమ డిమాండ్ సృష్టిస్తూ విక్రయలు సాగించేందుకు ఈ కొత్తజిల్లా ఎత్తుగడ వేస్తున్నారు. ప్రజలు కూడా దీనిపైనే చర్చించుకొంటున్నారు. జిల్లా అయిపోందట కద అంటూ చెప్పుకుంటున్నారు. దీన్ని నమ్మి కొందరు జిల్లా ప్రకటన అయ్యాక ధర ఇంకా పెరిగిపోతుందంటూ ప్లాట్లు, స్థలాలు కొనేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఉపసంఘం సైలెంట్

రాష్ట్రంలో భౌగోళిక స్వరూపాల మార్పులపై, పేర్లు మార్పుపై ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఇది ఎక్కడా కార్యకలాపాలను సాగించిన దాఖలాలు లేవు. ఈ విషయంలో ఏన్నో డిమాండ్లు ఉన్నాయి. ఇందులో మదనపల్లె జిల్లా ప్రకటనకు సంబంధించిన ప్రక్రియ కూడా ఉంది. ప్రస్తుతం చిత్తూరుజిల్లాలోని పుంగనూరు నియోజకవర్గం అన్నమయ్య జిల్లాలోకి కలిపేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసి అభ్యంతరాలకు గడువు విధించి దాని ప్రక్రియను పూర్తి చేసింది. ఈ వ్యవహారం కూడా పెండింగ్‌లో పడింది. భౌగోళికంగా మార్పులు చేస్తే ఈ డిసెంబర్‌లోగా పూర్తవ్వాలి. ఈ నియోజకవర్గం అన్నమయ్యజిల్లాలో కలపడానికి అభ్యంతరాలను లిఖితపూర్వకంగా తెలపనప్పటికీ ప్రజల్లో అయిష్టత వ్యక్తం అవుతోంది. చిత్తూరుజిల్లాలో కొనసాగేందుకే ఇష్టపడుతున్నారు. దాంతో ఈ విలీన కార్యక్రమం కూడా ఆగిపోయింది. మదనపల్లె జిల్లా ఏర్పాటుపై ప్రభుత్వం సుముఖతతో ఉంటే ఈపాటికి చర్యలు మొదలయ్యేవి. మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాలను కలిపి మదనపల్లె జిల్లా ఏర్పాటు చేయాలన్నది ప్రతిపాదన, అయితే దీనిపై ప్రభుత్వం ఆసక్తిగా ఉంటే ఉపసంఘం సమీక్షలు, సమావేశాలు, అభిప్రాయాల సేకరణ జరిగేవి. అయితే మదనపల్లె జిల్లా లేదు కాబట్టి ఉపసంఘంలో ఏమాత్రం కదలిక లేదు. ఈ నేపథ్యంలో మదనపల్లెజిల్లా ఏర్పాటు అంత తేలిక కాదన్న విషయం స్పష్టంగా అర్థమవుతోంది.

2027లోనే..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన ఉమ్మడిజిల్లాల పునర్విభజనలో మళ్లీ కొత్త జిల్లాల విభజన కసరత్తుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే 2027లో కదలిక రావొచ్చు. స్థానిక సంస్థల ఎన్నికలు, ఎన్నికల హామీ జిల్లాల ఏర్పాటుపై..2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాజకీయ ప్రయోజనాలను ఆశించి చర్యలు తీసుకునే అవకాశం లేకపోలేదు. అప్పటిదాకా ఎదురు చూడాల్సిందే.

అండర్-19 కబడ్డీ జట్ల ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన బాలికలతో ఉపాధ్యాయులు

నిమ్మనపల్లె: మండలంలోని రెడ్డివారిపల్లె మోడల్ స్కూల్‌లో శనివారం జిల్లా అండర్-19 కబడ్డీ జట్ల ఎంపిక నిర్వహించినట్లు స్కూల్‌గేమ్స్ కార్యదర్శి డాక్టర్.ఎస్.బాబు, నాగరాజ తెలిపారు. జిల్లాలోని 30 మండలాల నుంచి వచ్చిన 150 మంది క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఎంపీడీఓ రమేష్‌బాబు, ఎంఈఓ నారాయణ, పద్మావతి ముఖ్యఅతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలన్నారు. జిల్లా జట్లకు ఎంపికై న క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, క్రీడాభారతి పీడీఎస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నరేష్‌బాబు, సెలక్షన్ కమిటీ సభ్యులు శారద, మోహన్, అన్సర్‌బాషా, ఇందిర, మణి తదితరులు పాల్గొన్నారు.

'జీఎంసీ'లో పీజీ సీట్లు పెంపు



వైద్యులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జమున

కడప: కడపలోని ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్)లో చిన్న పిల్లల విభాగం (పీడియాట్రిక్స్)లో పీజీ సీట్ల సంఖ్య ఏడుకు చేరింది. ఎన్‌ఎంసీ ఇటీవల 4 పీజీ సీట్లు మంజూరు చేసింది. గతంలో 3 పీజీ సీట్లు ఉండేవి. సీట్ల పెంపు కోసం హెచ్‌ఓడీతోపాటు వైద్యులు కృషి చేశారని జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జమున తెలిపారు. శనివారం ప్రిన్సిపాల్ తమ చాంబర్‌లో పీడియాట్రిక్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ వై. వంశీధర్, వైద్యులు అనిల్ కిరణ్, పద్మినీ ప్రియా, బి.కె.నిరంజన్‌తోపాటు చిన్నపిల్లల విభాగం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రీకొడుకుల కుట్రలను గడపగడపకు తెలియజేయాలి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి



కోటి సంతకాల సేకరణ పత్రాలను అందజేస్తున్న ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట టౌన్: మెడికల్ కళాశాలలను తన అనుచరులకు కట్టపెట్టి తద్వారా జేబులు నింపుకునేందుకు చంద్రబాబునాయుడు, నారాలోకేష్ పన్నుతున్న కుట్రలను గడప గడపకు తెలియచేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ప్రైవేట్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ తలపెట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మున్సిపాలిటిలోని వివిధ వార్డులకు చెందిన కౌన్సిలర్లకు కోటి సంతకాల సేకరణ పత్రాలను ఎమ్మెల్యే అందచేశారు. అనంతరం అమరనాథరెడ్డి విలేకరులతో మాట్లాడారు. మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ అయితే ముఖ్యంగా పేదలకు నాణ్యమైన వైద్యం అందని ద్రాక్షలా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఆయా కళాశాలల యాజమాన్యాలు ఒక్కో మెడికల్ సీటుకు డొనేషన్ల రూపంలో భారీ మొత్తంలో తీసుకుటాయన్నారు. అందువల్ల పేద విద్యార్థులు డాక్టర్ కావాలన్న కల కలలాగనే మిగిలిపోతుందన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడతారని వైఎస్.జగన్ ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగా ప్రజల అభిప్రాయాన్ని కూడా సేకరించేందుకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి పిలుపునిచ్చారని తెలిపారు. ఈకార్యక్రమాన్ని జిల్లాలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలన్నారు. ప్రజల అభిప్రాయాలను జగన్ గవర్నర్ దృష్టికి తీసుకు వెళ్ళి ప్రైవేటీకరణను అడ్డుకునే ప్రయత్నం చేస్తారన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పోలా వెంకటరమణారెడ్డి, కృష్ణారావుయాదవ్, వడ్డే రమణ, డీలర్ సుబ్బరామిరెడ్డి, రక్కాసి శ్రీవాణి, మిర్యాల సురేఖ, ఖాజా మొహిద్దీన్, సనిశెట్టి నవీన్‌కుమార్, సూరి, నాసిర్, నామ్‌నగర్ శివ పాల్గొన్నారు.

కలంపై కూటమి కక్ష



నిజాలను నిర్భయంగా రాస్తున్న పత్రికలపై, విలేకరులపై కూటమి సర్కార్ కక్షగట్టింది. అక్రమ కేసులతో వేధిస్తోంది.పత్రికా కార్యాలయాల్లో సోదాలు, సంపాదకుల ఇళ్లలో తనిఖీల పేరుతో పత్రికా స్వేచ్ఛను హరిస్తోంది.అక్రమ కేసులు బనాయిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది. మీడియాపై అంక్షలు విధించడం తగదని పలువురు ప్రజాస్వామ్యవాదులు, పార్టీల నాయకులు అభిప్రాయపడతున్నారు.

కక్ష సాధింపు తగదు



సమాజంలో జరిగే వాస్తవాలను బయటపెడుతున్న పత్రికలపై కక్ష సాధించడం తగదు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై పోలీసులు వ్యవహరిస్తున్న తీరు సరికాదు. కూటమి నాయకులు చేస్తున్న అక్రమాలను వెలికితీస్తే కక్ష సాధింపునకు పాల్పడటం చూస్తే వారి వక్రబుద్ధి అర్థం అవుతోంది. ఇకనైనా ఇలాంటి చర్యలు ఆపాలి. – కొలిమి హారూన్ బాషా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి

పత్రికలపై కేసులు రాజ్యాంగ విరుద్ధం



రాజ్యాంగ పరిరక్షణలో కీలకపాత్ర మీడియాది. ప్రజాస్వామ్యం ప్రకారం తమ భావజాలాన్ని వ్యక్తం చేసే హక్కును రాజ్యాంగం మనకు కల్పించింది. తప్పుంటే రాజ్యాంగం ప్రకారం తిప్పకొట్టే అవకాశం ఉంది.అందుకు భిన్నంగా పత్రికల గొంతు నొక్కడం ఎరు చేసినా ఖండీనీయం. సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై కేసులు పెట్టడం, వేధించడం సమర్ధనీయం కాదు. –మర్రి రవికుమార్, వైస్‌చైర్మన్, రాజంపేట మున్సిపాలిటీ,

తగిన మూల్యం చెల్లించుకుంటారు



సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి, పాత్రికేయులపై అక్రమ కేసులు బనాయించడం అన్యాయం. నోటీసుల పేరుతో ఇళ్ల వద్దకు, సాక్షి కార్యాలయాల వద్దకు వెళ్లి పోలీసులు హంగామా సృష్టించడం అప్రజాస్వామికం. ప్రజల వాణిని వినిపించే మీడియా గొంతునొక్కే ప్రయత్నం చేయడం సరికాదు. ఇలాంటి చర్యలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.
– సయ్యద్ ముస్తాక్ మండల కన్వీనర్, పుల్లంపేట

పత్రికా స్వేచ్ఛను హరించడమే



ప్రజలకు వాస్తవాలను తెలియజేసి ప్రజాస్వామ్యానికి మూలస్తంభంగా నిలుస్తున్న పత్రికా స్వేచ్ఛను హరించడం తగదు. ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా ఉండాలే కానీ ఇష్టారాజ్యంగా వ్యవహరించకూడదు. 'సాక్షి'పై ఇలా కేసులు పెట్టి వేధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. –ఏ. రామాంజులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి , అన్నమయ్య జిల్లా

బెదిరింపులు మానుకోవాలి



రాష్ట్రంలో భావ ప్రకటన స్వేచ్ఛ లేకుండా పోతుంది. ప్రభు త్వ వైఫల్యాలను వెలుగులోకి తీసుకొస్తూ వార్తలు రాసే పాత్రికేయులపై అక్రమ కేసులు పెట్టి కలానికి సంకెళ్లు వేయాలనుకోవడం అవివేకం. సాక్షి మీడియాపై కక్షపూరితంగా వ్యవహరించడం విచారకరం. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై కేసులు పెట్టడం కాదు సహేతుకం కాదు. ప్రభుత్వం జర్నలిస్టులను బెదించే ధోరణికి స్వస్తి చెప్పాలి
– త్రినాథ్, రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, నందలూరు

ఉద్దేశ పూర్వకంగానే సాక్షిపై కుట్ర



ఉద్దేశ పూర్వకంగానే ప్రభుత్వం సాక్షి పత్రికపై కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పులను వెలుగులోకి తేవడం నేరం కాదు. తప్పులను ఎత్తిచూపే హక్కు పత్రికలకు ఉంది. స్వయంగా పోలీసు ఉన్నతాధికారులు సాక్షి కార్యాలయానికి వెళ్లడం, సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిని ప్రశ్నించడం విడ్డూరంగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ చర్యల పట్ల జర్నలిస్టులు విస్తుపోతున్నారు. – పోరెడ్డి నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ప్రొద్దుటూరు

పెద్ద దర్గా ఉరుసుకు విస్తృత ఏర్పాట్లు

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: నవంబర్ 4 నుంచి 10వ తేదీ వరకు జరగనున్న 'అమీన్ పీర్ దర్గా' ఉరుసు ఉత్సవాలను కులమతాలకు అతీతంగా ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేయాలని వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో అమీన్‌పీర్ దర్గా ఉత్సవాల నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లపై కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. జేసీ అదితి సింగ్, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఇతర అధికారులు, ఉరుసు ఉత్సవ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్త ప్రాముఖ్యం కలిగిన అమీన్ పీర్ దర్గా ఉత్సవాలను కడప నగర ఫెస్టివల్‌గా, మత సామరస్యాన్ని ప్రతిబింబించేలా స్టాండర్డ్ నిబంధనలను పాటిస్తూ ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.15 రోజుల ముందుగానే ముందస్తు ప్రణాళికతో అన్ని రకాల ఉత్సవ ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అమీన్ పీర్ దర్గా (పెద్ద దర్గా) కమిటీ సభ్యులు, జిల్లా యంత్రాంగం, అన్ని శాఖల అధికారులు, దర్గా నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఉరుసు ముందస్తు ఏర్పాట్లకు సంబంధించి వివిధ శాఖలకు జిల్లా కలెక్టర్ విధులు కేటాయించారు.

మున్సిపల్ అధికారులు: ప్రధానంగా పారిశుద్ధ్య సిబ్బందిని ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమలను చేపట్టాలన్నారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పరిశుభ్రత ఏర్పాట్లను చూడాలన్నారు. మొబైల్ టాయిలెట్స్, సురక్షితమైన తాగునీరు, హైమాస్ లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన కూడళ్లను అందంగా విద్యుత్ లైట్లతో అలంకరించాలని సూచించారు.

పోలీస్ శాఖ: పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేయాలని, ఎక్కడా ఎలాంటి సంఘటనలకు తావివ్వకుండా గట్టి భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులతోపాటు ప్రముఖులు, అత్యంత ప్రముఖులు రానున్న నేపథ్యంలో అంచనాతో అన్ని రకాల ఏర్పాట్లకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ట్రాఫిక్, పార్కింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

రెవెన్యూ శాఖ: పెద్ద సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో.. ఎక్కువగా గుమికుడే ప్రాంతాలలో బారికేడ్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. దర్గా నుంచి అంబులెన్స్ ద్వారా హాస్పిటల్స్ వెళ్లడానికి గ్రీన్ ఛానల్ దారిని ఏర్పాటు చేయాలన్నారు. వీఐపీ ప్రొటోకాల్, ప్రముఖులకు ప్రజాప్రతినిధులకు దర్గా ఆహ్వానాలు వంటి అంశాలను చూసుకోవాలని డీఆర్‌ఓను ఆదేశించారు.

వైద్య ఆరోగ్య శాఖ: వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అధిక సంఖ్యలో వైద్య సిబ్బందిని వైద్యాధికారులను నియమించి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. 108 అంబులెన్స్ తదితర వాహనాలతోపాటు అత్యవసర మందులు కూడా అందుబాటులో ఉంచాలన్నారు.

పర్యాటక శాఖ: నగరంలోని ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్, ఎయిర్‌ఫోర్ట్ ప్రాంతాలలో పెద్ద దర్గా, ఇతర దేవాలయాల టెంపుల్ టూరిజం క్యాంపెయిన్ చేపట్టాలని పర్యాటక అధికారులకు సూచించారు.

ఏపీఎస్‌ఆర్టీసీ: ప్రధాన ప్రాంతాలైన ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ తదితరాల నుంచి అమీన్ పీర్ పెద్ద దర్గా ప్రాంతానికి షటిల్, బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. మన జిల్లా నుంచే కాకుండా ఇతర రాయలసీమ జిల్లాలు, హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు. అలాగే ఉరుసు ప్రధాన రోజున దర్గా నుంచి వాటర్ గండి వరకు రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

విద్యుత్ శాఖ: ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పవర్ మేనేజ్‌మెంట్ చేయాలన్నారు. షార్ట్ సర్క్యూట్లు సంభవించకుండా విద్యుత్ శాఖ అధికారులు జాగ్రత్తలు పాటించాలన్నారు.

సమాచార శాఖ: పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలకు అత్యంత ప్రాచుర్యం వచ్చే విధంగా, భక్తుల్లో అవగాహన పెంచేందుకు అడ్వర్‌టైజ్‌మెంట్ క్యాంపెయిన్లు నిర్వహించాలన్నారు. అలాగే జిల్లాలోని చారిత్రక నేపథ్యం కలిగిన ఒంటిమిట్ట, దేవుని కడప దేవాలయాలపై టెంపుల్ టూరిజం పై అవగాహన పెంచే విధంగా పర్యాటక అధికారులతో కలిసి ప్రణాళిక చేయాలని సూచించారు.

అగ్నిమాపక శాఖ: ఎలాంటి అగ్నిప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అగ్నిమాపక శాఖ అధికారులను ఆదేశించారు. ఉర్సు పరిసర ప్రాంతాల్లో మినీ వ్యాన్లు, ఫైర్ ఇంజన్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

అమీన్ పీర్ దర్గా ప్రధాన ఉరుసు మహోత్సవం రోజు అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించాలని ఆదేశించారు.

గతంలో పెద్ద దర్గా ఉర్సు నేపథ్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది మల్టీ డిస్పెనరీ కంట్రోల్ రూమ్ కొనసాగుతుందని, ఇందులో ఏడు శాఖలకు చెందిన అధికారులు విధులు నిర్వహించాలని ఆదేశించారు.

సీఎంకు ఆహ్వానం

కడప సెవెన్‌రోడ్స్: కడప అమీన్ పీర్ దర్గా ఉరుసు ఉత్సవాలకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆహ్వానించారు. అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి హజ్రత్ కేఎస్ఎస్ అరిఫుల్లా హుస్సేనీ సాహెబ్.. సీఎంను కలిసి ఆహ్వానం అందించారు. జాతీయ స్థాయిలో పేరొందిన ఈ ఉరుసు మహోత్సవాలు నవంబరు 5వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరుగుతున్నాయని, ఈ మహోత్సవాలకు తప్పనిసరిగా హాజరు కావాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ సందర్భంగా ఉరుసు ఉత్సవ ఏర్పాట్లు ఏ విధంగా జరుగుతున్నాయని సీఎం వారిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అమీన్ పీర్ దర్గా మేనేజర్ మొహమ్మద్ అలీఖాన్, బాఖీ ఉల్లాఖాన్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి

ఓబులవారిపల్లె: చిన్నఓరంపాడు జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మోటార్ బైక్‌పై నుంచి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో కడప రిమ్స్‌కు తరలించారు. గాయపడిన వ్యక్తి వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని ఎస్‌ఐ పి.మహేష్ నాయుడు తెలిపారు.

పెన్నానదిలో యువకుడి గల్లంతు


నంద (ఫైల్ ఫొటో)

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లి గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన పెయ్యల నంద (36) అనే యువకుడు శనివారం పెన్నా నదిలో గల్లంతయ్యాడు. వంతాటిపల్లి గ్రామ సమీపంలో ఉన్న పెన్నానది వద్దకు చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ పెన్నానది నీటిలో పడిపోయాడు. సమాచారం తెలుసుకున్న సిద్దవటం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గల్లంతైన యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

బైకులు ఢీకొని గాయాలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఊటుకూరు వద్ద జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం రెండు బైకులు ఢీకొనడంతో యల్లటూరు ప్రదీప్ అనే యువకుడికి గాయాలయ్యాయి. కాలు విరగడంతో ప్రదీప్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

టపాసుల మోతే!

- తాత్కాలిక బాణసంచా దుకాణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- అన్నమమయ్య జిల్లాలో ఇప్పటికే 252 లైసెన్సులు జారీ
- పాత లైసెన్సులు.. తాత్కాలికం.. 252
- రూ. కోట్లలో టపాసుల వ్యాపారం
- నిబంధనలు తప్పనిసరి అంటున్న అధికారులు

అన్నమయ్య జిల్లాలో షాపుల వివరాలు	
లైసెన్సు షాపులు	42
ఈ ఏడాది అనుమతి పొందినవి	33
జిల్లాలో తాత్కాలికం	252

రాయచోటి : దీపావళి వేడుకలకు జిల్లా వ్యాప్తంగా విక్రయ కేంద్రాలను సిద్ధం చేశారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా టపాసుల విక్రయ కేంద్రాల నిర్వహణకు జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశానుసారం అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లపై పర్యవేక్షణ చేస్తున్నారు. రెవెన్యూ, పోలీసు, విద్యుత్ శాఖల సమన్వయంతో జిల్లాలోని శాశ్వత టపాసుల విక్రయ కేంద్రాలతో పాటు పండుగ సందర్భంగా తాత్కాలిక విక్రయ కేంద్రాల అనుమతుల విషయంపై నిర్ణయాలను తీసుకున్నారు. ఇప్పటికే అన్నమయ్య జిల్లాలో 42 శాశ్వత లైసెన్సుదారులకు గాను ఈ ఏడాది 33 షాపులకు అనుమతులు పొందారు. దీనితో పాటు రాయచోటి, మదనపల్లి, రాజంపేట, పీలేరు, కోడూరు, తంబళ్లపల్లి నియోజకవర్గాల్లో తాత్కాలిక షాపుల ఏర్పాటు కోసం 252 ఆన్‌లైన్ దరఖాస్తులు అందాయి. ఈ విక్రయకేంద్రాలను నివాస కేంద్రాలకు, పాఠశాలలకు, ఇతర ప్రమాదాలకు దూరంగా విశాలమైన ప్రదేశాలలో విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు అగ్నిమాపక అధికారి అనిల్‌కుమార్ తెలిపారు.

వన్ మెన్ కమిటీ..

బాణసంచా అమ్మకాలకు తాత్కాలికంగా ఏర్పాటు చేసే దుకాణాల కోసం ప్రభుత్వం కొత్త నిబంధనలను రూపొందించింది. గతంలో రెవెన్యూ అధికారులు దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చేవారు. ఈ ఏడాది వన్‌మెన్ కమిటీ అంటే రెవెన్యూ, పోలీస్, ఫైర్, విద్యుత్ శాఖల సమన్వయంతో తాత్కాలిక విక్రయ కేంద్రాలకు అనుమతితో ఎన్‌ఓసీ ఇవ్వాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేసుకున్న తర్వాత క్షేత్రస్థాయిలో ఉండే అగ్నిమాపక శాఖ అధికారులు పరిశీలన చేసి నివేదిక అందిస్తారు.

నిబంధనలు ఏం చెబుతున్నాయి..

- అగ్నిమాపక శాఖ నిబంధనల ప్రకారం జనావాసాల్లో ఎట్టి పరిస్థితుల్లో టపాసుల విక్రయాలు, దుకాణాలు ఉండరాదు. గోదాములు సైతం ఏర్పాటు చేసేందుకు అనుమతి ఉండదు
- నివాస సముదాయాలకు కనీసం 50 మీటర్ల దూరంలో దుకాణాలు ఉండాలి.
- తాత్కాలికంగా ఏర్పాటు చేసే దుకాణాలు సైతం 3 మీటర్ల దూరంలో ఉండాల్సి ఉంటుంది.
- దుకాణాల దగ్గర సిగరెట్, బీడీ తాగరాదు.
- ప్రతి దుకాణం వద్ద ప్రత్యేకంగా నీటిసౌకర్యం, అగ్ని నిరోధక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలి.
- జనావాసాల మధ్య తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసే చోట తప్పనిసరిగా అగ్నిమాపక శాఖ ఎన్‌ఓసీ ఉండి తీరాలి. ప్రమాద బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ధూమపానం నిషేధిత స్థలంగా ప్రకటించాలి.
- అగ్నిప్రమాదం జరిగితే వెంటనే అంటుకునే తడికలు, ప్లాస్టిక్ కవర్లతో దుకాణాలు ఏర్పాటు చేయరాదు. ప్రత్యేకంగా తయారు చేసిన జింక్, జీఐ రేకులతో మాత్రమే వీటిని ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా షెడ్‌లలో హౌస్ కీపింగ్, చుట్టుపక్కల ప్రదేశాలు శుభ్రంగా ఉండాలి.
- ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే అక్కడికి అగ్నిమాపక వాహనం వచ్చి చుట్టూ తిరిగే విధంగా స్థలం ఇచ్చి షెడ్‌లను నిర్మాణం చేసుకోవాలి.
- ఒక దుకాణానికి మరో దుకాణానికి కచ్చితంగా 3 మీటర్ల దూరం ఉండాలి. వాటితో పాటు బాణసంచా కొనుగోలు చేయడానికి వచ్చే వారి కోసం ప్రత్యేకంగా దారులు ఏర్పాటు చేయాలి.
- విద్యుత్ వైరింగ్ చేసుకునే సమయంలో ఎలాంటి అతుకులు లేని వైర్ ఉపయోగించాలి. ఒక్కో సందర్భంలో వీటి నుంచి మంటలు వచ్చే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో విద్యుత్ వైరింగ్‌ను జాగ్రత్తగా చూసుకోవాలి.
- రేకులతో కూడిన్ షెడ్‌లు వేస్తేనే అనుమతి ఇస్తారు. ప్రతి దుకాణంలో రెండు మంటలను ఆర్పే పరికరాలు, 200 లీటర్ల రెండు డ్రమ్ములు, 4 నీటి బకెట్‌లు, రెండు ఇసుక బకెట్‌లను అందుబాటులో ఉంచుకోవాలి.
- బాణసంచా దుకాణాల సమీపంలో ఎలాంటి పరిస్థితిలోనూ పొగ తాగరాదని ప్రత్యేకంగా బోర్డులు ఏర్పాటు చేయాలి.
- తాత్కాలికంగా ఏర్పాటు చేసుకునే దుకాణాలకు దూరంగా వాహనాలను పార్కింగ్ చేసేలా చూడాలి.


రాయచోటిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక టపాసుల దుకాణాలు

ఏవైనా అనుకోని సంఘటనలు జరిగితే సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ల వివరాలిలా..	
జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పి.అనిల్‌కుమార్	9949991069
రాయచోటి	9963737253
లక్కిరెడ్డిపల్లి	9963727731
రాజంపేట	9963479554
రైల్వేకోడూరు	9963879126
మదనపల్లి	9963735597
వాల్మీకిపురం	9963737042
ములకలచెరువు	9963736976
పీలేరు	9963736587


షాపుల్లో ఉన్న టపాసులు

పరిశీలన తర్వాతే అనుమతులు



ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిబంధనల ప్రకారం బాణసంచా నిర్వాహకులు కచ్చితంగా నిబంధనలు పాటించాలి. లేకపోతే వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు దుకాణాలు సీజ్ చేస్తాం. దరఖాస్తు చేసుకున్న ఫాంలో ఉన్న జాగ్రత్తలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. రేకులషెడ్ కచ్చితంగా వేసుకోవాలి. షెడ్ నిర్మాణం తర్వాత పరిశీలన చేసి అనుమతి ఇస్తాం. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 252 దుకాణాలకు దరఖాస్తులు వచ్చాయి.

- అనిల్‌కుమార్, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి, అన్నమయ్య జిల్లా

అర్ధరాత్రి లిఫ్ట్ ఇచ్చి దోపిడీ చేశారు

మదనపల్లె రూరల్ : అర్ధరాత్రి వేళ బస్సు దిగి ఇంటికి నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తికి లిఫ్ట్ ఇస్తామని బలవంతంగా బైక్‌లో ఎక్కించుకుని దారిదోపిడీ చేసిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని సత్సంగ్ స్కూల్ సమీపంలో నివాసం ఉన్న విజయ్‌కుమార్‌రెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి బెంగళూరులో ఆత్మకూరు బస్సులో బయలుదేరి రాత్రి 12.45 గంటల సమయంలో నక్కలదిన్నె తండా వద్ద దిగి ఇంటికి నడిచి వెళుతున్నాడు. ఆ సమయంలో అక్కడే కాపు కాసిన గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై అతడి వద్దకు వచ్చి లిఫ్ట్ ఇస్తామని బలవంత పెట్టారు. అతడు వద్దని చెప్పినా వినిపించుకోకుండా బలవంతంగా బైక్‌లోకి ఎక్కించుకున్నారు. కొంతదూరం వెళ్లాక బైక్ నిలిపి అతడి వద్ద ఉన్న రూ.20వేల నగదు, 15 గ్రాముల బంగారు చైను దోచుకున్నారు. బాధితుడు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో దోపిడీ ఘటనపై ఫిర్యాదు చేయగా, ఎస్‌ఐ శివకుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు.

షార్టు సర్క్యూట్‌తో టీ షాపు దగ్ధం

రాయచోటి టౌన్ : రాయచోటి - చిత్తూరు రోడ్డులోని రింగ్ రోడ్డులోని మిస్టర్ టీ షాపు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. శుక్రవారం సాయంత్రం టీషాపు నిర్వహిస్తున్న సమయంలో విద్యుత్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా షాపులో మంటలు రేగాయి. దీంతో ఆ షాపులో ఉన్న తినుబండారాలు, టీ మెటీరియల్, ఇతర వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి.

స్థానికులు వెంటనే మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయిందని మిస్టర్ టీ షాపు నిర్వాహకుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మంటలలో సుమారు రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని తెలిపారు. దీనిపై అగ్నిమాపక అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

LEASE/RENT

■ కడప జిల్లా నందు పక్కా రిజిస్ట్రేషన్ ప్లాట్ 6 సెంట్లు ఆయకంకు/లీజుకు/ అమ్మబడును. సంప్ర 9493851569

TO-LET

■ సింహపురి కాలని, కడప టౌన్, డో.నెం. 7-347/11, ఫస్ట్ ఫ్లోర్, RTCబస్టాండ్, 3 BHK ఉఫ్ట్ ఫేసింగ్, కార్ పార్కింగ్‌తో ఆఫీసులకు /రెసి డెన్షి బాడుగకు. 9440046190, 9398439598.

SERVICES

HEALTH CARE

■ రైస్ ఫైన్ హాస్పిటల్ Maternity and Laparoscopy Center D.No. 1/112, రైల్వే స్టేషన్ రోడ్డు, సంధ్య సర్కిల్ కడప, మా హాస్పిటల్ నందు అన్ని రంగాల ప్రభుత్వ ఉద్యోగస్తులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కలదు. 8309550308

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, KALAKATTA ASMATH (OLD NAME), R/O. D.NO. 11/42, SUNNAPURALLAPALLI, UTUKUR, RAJAMPET (M), ANNAMAYYA (DT), A.P., HEREBY CHANGED MY NAME AS KALAKATLA ASMATH (NEW NAME), W/O. K.BRAHMAIAH.

WANTED

■ కడపలో ప్రముఖ కార్ గ్యారేజ్ నందు పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్ (లేడీ) కావలెను. కడప లోకల్ వారికి ప్రాధాన్యత సంప్ర: 8328050062

■ Wanted female Receptionist-1 Male Marketing Excutive-1 Staff Nurses-2 For Hospital in Kadapa. Cont: 8556855699, 9493557373

■ శ్రీ వేన డీలక్స్ డార్మిటరీ A/C నందు రిసెప్షన్, మెయింటెనెన్స్ చేయుటకు ఇంటర్, డిగ్రీ ఫెయిల్ అయిన వాళ్లు కావలెను. భోజనం + వసతి ఫ్రీ. జోయాలుకాస్ జువెలర్స్ పక్కన ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్, కడప. 7799387793, 8297649798

■ కస్టమర్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP&డాక్టర్స్ కావలెను.జీ.15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9014885406

■ AIRTEL BROADBAND INTERNET డిస్ట్రిబ్యూటర్ వద్ద పనిచేయుటకు మార్కెటింగ్ (సేల్స్) & టెక్నికల్ స్కిల్స్ (ఫైబర్ స్ప్లైసింగ్) కలవారు. సంప్ర: 9949922268

■ A1 అంబులెన్సు నందు పనిచేయుటకు డ్రైవర్స్ కావలెను. 1 & 2 సం॥రాలు అనుభవం లైసెన్స్ ఉండవలెను. సంప్ర: 9502096994

■ 19 సం॥ వయస్సు ఉన్న అటెండర్ (బాయ్) కావలెను. సంప్ర: చిరునామా ఏ.వీ.ఎస్ చంద్రారెడ్డి, ఎం.ఎస్.సి, ఎం.ఈ.డి., ఏ.ఎం.ఎఫ్.ఐ, FC UTI మ్యూచువల్ ఫండ్స్, UTI ITSL IT PAN CARD 21-10, 1వ ఫ్లోర్, తిరుమల హాస్పిటల్ దగ్గర, LED ప్రక్కన, ఆర్.ఎస్.రోడ్, కడప -516001

■ రామకృష్ణ గ్రూప్ (AP NO-1), VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 63010 53690, 92814 52838.

■ కామర్స్, సివిక్స్, ఏకనామిక్స్ లెక్చరర్లు, గణితం టీచర్, వార్డెన్ క్లర్క్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్, బస్ డ్రైవర్ వాచ్ మెన్, వంట మనిషి, ఆయాలు కావలెను.9966008758

■ గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు క్లాసు ఇన్‌ఛార్జిస్, హాస్టల్ ఇన్‌ఛార్జిస్, వార్డెన్స్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 12,000/- నుండి 15,000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనం, వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరములు పైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 92487 33371

■ CDS PU NGO కడప నందు ప్రోగ్రాం మేనేజర్‌గా పనిచేయుటకు అభ్యర్థి కావలెను. జీతం 21000+TA 1400, విద్య అర్హత MSW & Sociology ఆసక్తిగల అభ్యర్థులు 24.10.2025 లోగ ఈ క్రింది mail కి Resume ను పంపగలరు. cdstingokadapa@gmail.com Cont: 7059453054, 9440758103

■ నంద కీర్తన్ ఆటో ఫైనాన్స్‌లో రికవరీ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత ఇంటర్ లేదా డిగ్రీ ఫైనాన్స్ రంగంలో కనీసం ఒక సంవత్సరం అనుభవం ఉన్నవారికి, త్రీ వీలర్, ఫోర్ వీలర్ డ్రైవింగ్ తెలిసిన వారికి అదనపు ప్రాధాన్యత వయస్సు 22 నుండి 30 సంవత్సరాలు, సంప్ర ఫోన్ 9959594942, 9963131849

■ ప్రముఖ టైల్స్ కంపెనీకి TSM లు మరియు రిసెప్షనిస్టులు కావలెను. సంప్ర: 9110757740, hr@amartiles.com

■ మదనపల్లిలో గోల్డ్ అప్రైజర్ కోర్స్ నేర్పించబడును. నేర్పించుకొన్నవారికి 100 జాబ్ 25 వేలు జీతం Tada ఇవ్వబడును. సంప్ర: 9010579111

■ **Wanted Teachers:** Maths- IX & X-1, Social -III to V -1, Drawing-1, P.E.T-1, Warden (Male)-2, Cont: 9154944970 9154944955

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశ్లేషించుకొని పరిశీలించుకొని పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులకు కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా రుసుములు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి


మృతి చెందిన కొనిరెడ్డి మహేంద్రరెడ్డి

రాజంపేట : రాజంపేట-రాయచోటి రోడ్డులోని పాలకేంద్రం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి కొనిరెడ్డి మహేంద్రరెడ్డి మృతి చెందాడు. నగరవనం నుంచి బైకులో వస్తూ పాలకేంద్రానికి ఎడమవైపు ఉన్న ఎంజీఆర్ ఐరన్ హోర్డింగ్‌ను బలంగా ఢీ కొట్టాడు. బైకు రైడర్ మహేంద్రకు రక్తగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న స్నేహితునికి స్వల్ప గాయాలు అయ్యాయి. సీఐ నాగార్జున మాట్లాడుతూ రాజంపేట పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు హెల్మెట్ ధరించాలన్నారు. అజాగ్రత్త, నిర్లక్ష్యం, అతివేగంగా బైకులను నడపటం ప్రమాదకరమన్నారు. ఒక్కసారి విద్యార్థులు తమ కుటుంబం, తల్లిదండ్రులను గుర్తుంచుకొని, బైకులు జాగ్రత్తగా నడపాలన్నారు. ఈ ప్రమాదంపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన విద్యార్థిని సీఐ నాగార్జున, ఎస్‌ఐలు పరామర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మదనపల్లె సహకార గృహ నిర్మాణ సంఘ కార్యవర్గ ఎన్నిక నోటిఫికేషన్ విడుదల

రాయచోటి జగదాంబసెంటర్ : మదనపల్లె పట్టణంలోని మదనపల్లె సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్‌కు నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకొనేందుకు నోటిఫికేషన్‌ను ఈ నెల 18వ తేదీన విడుదల చేసినట్లు ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.రాజశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 22న నామినేషన్ల స్వీకరణ, 23న నామినేషన్ల పరిశీలన, 24న నామినేషన్ల ఉపసంహరణ, 24న నామినేషన్ల తుది జాబితా సాయంత్రం 5 గంటల తరువాత ప్రకటన, 29న పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు మదనపల్లెలోని రామాలయం వీధి సొసైటీ కాలనీలో గల నెహ్రూ మున్సిపల్ ప్రైమరీ, హైస్కూల్‌లో ఉంటుందన్నారు. ఈ నెల 30న అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యుల ఎన్నిక ఉంటుందని ఆ ప్రకటనలో వివరించారు.

ఆక్రమణకు యత్నించిన వ్యక్తులపై కేసులు నమోదు

మదనపల్లె రూరల్ : ప్రభుత్వ భూముల ఆక్రమణకు యత్నించిన వ్యక్తులపై తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. మండలంలోని కోళ్లబైలు పంచాయతీ సర్వే నెంబర్.599/4లోని ప్రభుత్వ స్థలం స్వరూప స్వభావాలు మార్చి చదును చేసేందుకు ప్రయత్నించిన పట్టణంలోని నీరుగట్టువారిపల్లె గజ్జలకుంటకు చెందిన కె.శ్రీనివాసులు, భాస్కర్‌పై కేసు నమోదు చేశామన్నారు. అదే విధంగా కోళ్లబైలు పంచాయతీ సర్వేనెంబర్.598/3, 599/2 లోని ప్రభుత్వ స్థలాన్ని రాయచోటి కృష్ణాపురానికి చెందిన వలిపి సిద్దయ్య, నీరుగట్టువారిపల్లె గజ్జలకుంటకు చెందిన నాగమల్లు.. హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరించి, ప్రభుత్వ స్థలాన్ని చదునుచేసి ఆక్రమించేందుకు ప్రయత్నించారన్నారు. తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు నలుగురు నిందితులపై రెండు వేర్వేరు కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బాలికపై మేనమామ వేధింపులు

కైకలూరు : మేనమామ వేధించడంతో పాటు తల్లి, అమ్మమ్మ, తాత చిత్రహింసలకు గురిచేశారని 9వ తరగతికి చెందిన బాలిక బావురుమంది. నరకం నుంచి బయటపడ్డానని గాయాలను చూపించింది. ఈ ఘటన ఏలూరు జిల్లా కైకలూరు మండలం చటాకాయికి చెందిన బాలికపై వైఎస్సార్ కడప జిల్లా బద్వేలు సమీప అగ్రహారంలో జరగ్గా ఆలస్యంగా వెలుగు చూసింది. శనివారం ఆమెను తండ్రి కైకలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చాడు. పోలీసులకు ఆమె వివరాలు వెల్లడించింది. బాధితురాలు, ఆమె తండ్రి తెలిపిన వివరాల ప్రకారం.. చటాకాయికి చెందిన జయమంగళ కుమార అభిమన్యుడుకి ఏలూరు మండలం శ్రీపర్రుకు చెందిన కామాక్షితో 2009లో వివాహమైంది. వీరికి 2012లో అమ్మాయి జన్మించింది. అనంతరం ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో విడాకులు తీసుకున్నారు. అప్పటినుంచి కుమార్తె తండ్రి వద్ద ఉంటోంది. కామాక్షి మరో వ్యక్తిని వివాహం చేసుకోగా.. అభిమన్యుడు మరో మహిళను వివాహం చేసుకున్నాడు. మొదటి భార్య కుమార్తె (14) తండ్రి వద్దే ఉంటూ భుజబలపట్నంలో 9వ తరగతి చదువుతోంది.

దసరా పండక్కి తీసుకెళ్లి: తండ్రి లేని సమయంలో కామాక్షి, ఆమె తల్లి చటాకాయలో ఉంటున్న బాలిక వద్దకు వచ్చి దసరా పండగకు దుస్తులు కొంటామని ప్రత్తికోళ్లలంక, అక్కడ నుంచి కామాక్షి సోదరుడు ఉమాశంకర్, తల్లిదండ్రులు నాగులమ్మ, వెంకటరమణ ఉంటున్న కడప జిల్లా బద్వేలుకు తీసుకువెళ్లారు. బాలికను అక్కడే ఉండాలని బలవంతం చేయడంతో ఆమె నిరాకరించి తండ్రి వద్దకు వెళతానని చెప్పింది. దీంతో తన తల్లి కామాక్షి ఇష్టానుసారం తనను కొట్టిందని బాలిక వాపోయింది. మేనమామ ఉమాశంకర్ తనతో అసభ్యంగా ప్రవర్తించాడని పోలీసులకు చెప్పింది. బద్వేలులో బాలిక పరిస్థితిని చూసిన ఓ వ్యక్తి తండ్రి అభిమన్యుడికి ఫోన్ చేయగా అక్కడికి వెళ్లి శుక్రవారం రాత్రి చటకాయకు తీసుకువచ్చారు.

పరిమి శ్రీరామనాథ్‌కు గడియారం సాహిత్య పురస్కారం


పరిమి శ్రీరామనాథ్


కడప సెవెన్‌రోడ్స్ : హైదరాబాదుకు చెందిన యువకవి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పరిమి శ్రీరామనాథ్ 'మహాకవి' డాక్టర్ గడియారం వేంకట శేషశాస్త్రి 44వ సాహిత్య పురస్కారానికి ఎంపికైనట్లు రచన సాహిత్య వేదిక కార్యదర్శి డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి తెలిపారు. పురస్కార ప్రదాన సభ రచన సాహిత్య వేదిక, గడియారం కుటుంబీకుల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 26వ తేది సాయంత్రం 5:30 గంటలకు ప్రొద్దుటూరులోని అరవిందాశ్రమంలో నిర్వహిస్తున్నామన్నారు. 1982 నుంచి ప్రతి ఏటా రాష్ట్ర స్థాయిలో ఎంపికైన కావ్యానికి బహూకరిస్తూ వస్తున్న ఈ అవార్డుకు 2025 సంవత్సరానికి పరిమి శ్రీరామనాథ్ రచించిన 'జీవాతువు' అనే కావ్యం ఎంపికైనట్లు తెలిపారు. పురస్కార ప్రదాన సభలో శ్రీరామనాథ్‌కు కవి సన్మానం, అవార్డుకు గాను రూ.10,000 నగదు బహుమతి, పురస్కారపత్రం, ప్రశంసాపత్రం అందజేయనున్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


జగదీష్ (ఫైల్‌ఫొటో)

చక్రాయపేట : మండలంలోని గండి కొవ్వూరు గ్రామం ఓబుళనాయునిపల్లెలో గండికోట జగదీష్(18) అనే యువకుడు తమ ఇంటిలోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జగదీష్ తల్లిదండ్రులు జనార్దన, పావని జీవనోపాధి నిమిత్తం కువైట్‌లో ఉన్నారు. లక్కిరెడ్డిపల్లెలోని అమ్మమ్మ ఇంటివద్ద జగదీష్ ఉండేవారు. తనకు బుల్లెట్ బైకు కొనివ్వమని ఫోన్ చేసి వత్తిడి తేవడంతో తండ్రి మందలించాడని మనస్థాపానికి గురై లక్కిరెడ్డిపల్లె నుంచి ఓబుళనాయునిపల్లెలో ఉన్న ఇంటికు వచ్చాడు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. జగదీష్ ఫోన్ పనిచేయక పోవడంతో పాటు అలిగి వచ్చాడని అతని అమ్మమ్మ శనివారం ఓబుళనాయునిపల్లెలోని ఇంటి వద్దకు వచ్చి తలుపు తీయగా జగదీష్ ఉరివేసుకుని ఉండటాన్ని గమనించింది. గట్టిగా కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వారు వచ్చి సమాచారాన్ని పోలీసులకు చేరవేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం అమ్మకాలు


మద్యం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఉమ్మడి కడప జిల్లాలో కల్తీ మద్యానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ప్రవేశ పెట్టిందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు పేర్కొన్నారు. శనివారం జిల్లాలోని కడప నగరం, బద్వేలు, సిద్దవటం పరిధిలోని మద్యం దుకాణాల్లోని అమ్మకాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మద్యం కొనుగోలు చేసే వ్యక్తి ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా స్కాన్ చేయగానే మద్యం తయారీ, ధర, తయారు చేసిన కంపెనీ, ఏ మద్యం దుకాణంలో విక్రయించారు అనే వివరాలు పొందవచ్చన్నారు.

లక్ష మద్యం బాటిళ్ల స్కానింగ్


మద్యం బాటిల్‌ను స్కాన్‌చేసి వివరాలు చూపుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్

మదనపల్లె రూరల్ : జిల్లాలో ప్రతిరోజు మద్యం దుకాణాల్లో లక్షకు పైగా మద్యం బాటిళ్లను స్కానింగ్ చేసి విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు. శనివారం పట్టణంలోని పలు మద్యం దుకాణాలు, బార్లలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ తనిఖీ చేశారు. షాపులో మద్యం బాటిల్‌ను స్వయంగా స్కాన్ చేసి అందులోని వివరాలను వినియోగదారుడికి చూపించి విక్రయించారు. ఈ సందర్భంగా ఈఎస్ మధుసూదన్ మాట్లాడుతూ.. ఈనెల 16 నుంచి జిల్లాలోని 122 మద్యం దుకాణాలు, 11 బార్లలో మద్యం బాటిళ్లను స్కాన్ చేశాకే విక్రయిస్తున్నట్లు తెలిపారు. రోజుకు సుమారుగా రూ.1.62 కోట్ల మద్యం వ్యాపారం జరుగుతోందన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా కల్తీ మద్యం విక్రయాలు జరగడం లేదన్నారు. స్కాన్ విధానంపై మద్యం వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. మద్యం షాపు పర్మిట్ రూముల్లో కిచెన్లు, రెస్టారెంట్లు నిర్వహించరాదన్నారు. మద్యం దుకాణాలు, బార్లు సమయపాలన పాటించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మదనపల్లె ఎక్సైజ్ సీఐ భీమలింగ, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 50 గొర్రెలు మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

బి.కొత్తకోట : బి.కొత్తకోటకు సమీపంలోని బాలసానివారిపల్లెలో శనివారం సాయంత్రం వీధి కుక్కలు దాడి చేసి విచక్షణారహితంగా కొరకడంతో 50 గొర్రెలు మృతి చెందాయి. బాలసానివారిపల్లెకు చెందిన ఎం.బాబు గొర్రెల పెంపకంతో జీవిస్తున్నాడు. శనివారం వర్షం కురవడంతో గొర్రెలను గ్రామంలోనే గొర్రెలదొడ్డిలో వదిలి ఇంటికి వెళ్లాడు. సాయంత్రం ఆరు గంటల సమయంలో ఎక్కడినుంచో వచ్చిన వీధి కుక్కలు గొర్రెలదొడ్డిలోకి దూరి గొర్రెలపై దాడి చేశాయి. దీంతో 50 గొర్రెలు మృతి చెందగా రూ.3 లక్షల నష్టం వాటిల్లింది. మూడు నెలల క్రితం ఇలాగే బాబుకు చెందిన 11 గొర్రెలను కుక్కలు కొరికి చంపేయగా రూ.లక్ష నష్టం జరిగింది. ఇప్పుడు మళ్లీ 50 గొర్రెలు చనిపోవడంతో తనకు దిక్కేది అంటూ ఆవేదన చెందుతున్నాడు. కాగా బాలసానివారిపల్లె సమీపంలోని కమ్మోరుపల్లెలో మూడు రోజుల క్రితం కుక్కలు దాడి చేయడంతో హరి అనే వ్యక్తికి చెందిన 12 గొర్రెలు మృతి చెందాయి. దీంతో బాధితునికి రూ.1.20 లక్షల నష్టం వాటిల్లింది. వీధి కుక్కలను అదుపుచేసి గొర్రెలను కాపాడాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

ఐదుగురు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

20 దుంగలు స్వాధీనం


పోలీసుల అదుపులో ఎర్రచందనం స్మగ్లర్లు

నందలూరు : మండలంలోని మదనమోహనపురం క్రాస్ సమీపంలో ఐదుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఎస్‌ఐ మాట్లాడుతూ రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, నందలూరు సిబ్బంది, అన్నమయ్య ఆర్‌ఎస్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కలిసి ఈ నెల 17వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు మండలంలోని ఎంఎంపురం క్రాస్ రోడ్డు సమీపంలో ఆవుల రవికుమార్, పొత్తపి పెంచలయ్య, బండారు సందీప్, కానపర్తి వంశీకృష్ణ, ఇమిడి నాగరాజు అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారు అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి బరువు సుమారు 512.9 కేజీలు, వాటి విలువ సుమారు రూ.6.85 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇంకా కొంతమంది నిందితులు పరారీలో ఉన్నారన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి తిరుపతి కోర్టులో హాజరు పరిచామన్నారు. ఈ కేసులో ప్రతిభ కనపరిచిన రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, స్థానిక ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, పోలీసు సిబ్బందిని, అన్నమయ్య జిల్లా ఆర్‌ఎస్ టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ధీరజ్ అభినందించారు.

విద్యార్థుల సమస్యలపై బస్సు జాతా


పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

రాయచోటి టౌన్ : రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు నిర్వహిస్తున్న బస్సు జాతాను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు కోరారు. శనివారం రాయచోటి పట్టణంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ ఈ బస్సు జాతా ఈనెల 22వ తేదీ నుంచి నవంబర్ 12వ తేదీ వరకు సాగుతుందన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.6400 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4500 ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయని వెంటనే వాటిని పునః ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలలో ఫీజుల దోపిడీని అరికట్టి ఫీజు నియంత్రించాలని కోరారు. ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, ప్రతి మండలానికి ఒక డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నారాయణ, ధనకుమార్, రఘుపతి, రెడ్డికుమార్, వంశీ, ఆశిక్ తదితరులు పాల్గొన్నారు.